క్లుప్తంగా

తిరుపతికి జిన్నారం భజన మండలి సభ్యులు

మరికల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో సేవ కార్యక్రమాలను నిర్వహించేందుకు సోమవారం జిన్నారం ఆంజనేయ భజన మండలి సభ్యులు భజనాలు చేసుకుంటూ తరలి వెళ్లారు. అంతకుముందు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. వారం రోజుల పాటు వివిధ సేవ కార్యక్రమాల్లో పాల్గొంటున్న భజన మండలి సభ్యులు తెలిపారు.

ఎస్పీకి వినతి



మక్తల్: వినాయక విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎస్పీ గౌతమ్ యోగేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. మక్తల్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రశేఖర్, అనిల్‌కుమార్, మంజునాథ్, నర్సింహ, కుర్మయ్య, వినయ్, విజయ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్ తగదు

నారాయణపేట: ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడం తగదని టీపీయూఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహులు సోమవారం సంయుక్త ప్రకటనలో ఖండించారు. పిల్లల్లో మార్పు కోసం ప్రయత్నించిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు అండగా నిలవాలని అప్పుడే పూర్తి అంకిత భావంతో పనిచేస్తారని తెలిపారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని సస్పెండ్ చేసిన అధికారులకు తగిన సూచనలు ఇచ్చి ఉపాధ్యాయురాలు శిరీష సస్పెన్షన్‌ని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

డ్రెయినేజీలు శుభ్రం చేయండి

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలోని పలు కాలనీలోని డ్రెయినేజీలో చెత్త, చెదారం చేరి మురుగు పారడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. వర్షాకాలం కావడంతో మురుగు నిల్వతో దుర్వాసనతో పాటు దోమల బెడద అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు సమస్య విన్నవించిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

వైఎస్ విజయమ్మను కలిసిన వర్కటం



మక్తల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మను సోమవారం హైదరాబాద్‌లో నియోజకవర్గానికి చెందిన వర్కటం జగన్నాథ్‌రెడ్డి, అంజనారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

నీటిలో మునిగి కాడెద్దులు మృతి

నర్వ: కాడెద్దులు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని లంకాల్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు సంజీవరెడ్డి తన రెండు ఎద్దులతో పొలం పనుల కోసం బండి కట్టుకుని పనులు చేశాడు. అనంతరం వాటికి నీటిని తాగించేందుకు గ్రామ చెరువులోకి వెళ్లగా ఎద్దులు అలాగే నీటిలోకి వెళుతూ మునిగిపోయాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకుని ఎద్దులను బయటకు లాగగా అప్పటికే అవి మృతి చెందాయి. ఒక్కో ఎద్దు విలువ రూ.80 వేల వరకు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ రూ.10వేలు ఆర్థికసాయం అందించారు.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



దేవరకద్ర: మండల కేంద్రంలో సోమవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాలతో పాటు పలు వీధులలో కవాతు కొనసాగింది. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలకు పోలీసుల రక్షణతో పాటు భరోసా ఇవ్వడానికి ఈ కవాతు నిర్వహించినట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు. కవాతులో డిప్యూటీ కమాండర్ భగాలీ, ఎస్ఐ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో అందని వైద్యం

- మద్దూరులో ప్రారంభమై రెండేళ్లు..
- వైద్యులను నియమించని వైనం
- స్టాఫ్ నర్సులచే వైద్య సేవలు



మద్దూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్

మద్దూరు: మండల కేంద్రంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్న ఈ ప్రాంత ప్రజలకు వైద్యం అందుబాటులోకి రాలేదు. అత్యవసర సమయాల్లో ఏ చిన్న సమస్య వచ్చినా నారాయణపేట జిల్లా ఆస్పత్రికో, లేకుంటే మహబూబ్‌నగర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ ఆస్పత్రిలో వైద్య సేవల కోసం జిల్లా ఆస్తపిలో పనిచేస్తున్న డాక్టర్‌తో పాటు మరో పీహెచ్‌సీలో ఉన్న స్టాప్ నర్స్‌తో ఇక్కడ వైద్య సేవలు కొనసాగుతున్నాయి. ఉదయం సయమంలో పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ ఓపీ చూస్తున్నారు. అత్యవసర సమయంలో వైద్యం కావాలంటే అంతే సంగతి.

వైద్యం వికటించి బాలింత, శిశువు మృతి

మద్దూరు సీహెచ్‌సీలో కాన్పు కోసం తిమ్మారెడ్డిపల్లి చెందిన కృష్ణవేణి(26) గతేడాది ఆగస్టు 5న వచ్చింది. దీంతో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్ నర్సులు కాన్పు చేసే క్రమంలో ఆడ శిశువు పురిటిలోనే మృతి చెందింది. శిశువును బయటకు తీసే క్రమంలో తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను హుటాహుటినా 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సీహెచ్‌సీకి మద్దూరు, దామరగిద్ద, దౌల్తాబాద్ మండలాల నుంచి దాదాపు 80 గ్రామాలకు ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. నిత్యం దాదాపు 200 నుంచి 250 వరకు ఓపీ వస్తుంటారు.

8 మంది డాక్టర్లకు ఒక్కరే?

ఈ స్పాత్రిలో గైనిక్ సేవలు, జనరల్ సర్జన్, చిన్నపిల్లలకు వైద్య నిపుణుడు, మత్తు వైద్యుడు, దంత, అత్యవసర సేవలకు వైద్యులు 8 మంది, సూపరింటెండెంట్, ఇద్దరు ఫార్మాసిస్టులు, ఆయూష్ మెడికల్ అధికారి, ల్యాబ్ టెక్నీషియన్, రేడియాలజీ, అఫ్తాలమిక్ అసిస్టెంట్, డెంట్ అసిస్టెంట్, ఓటి టెక్నీషియన్, 10 మంది నర్సులు, ఇతర సిబ్బందితో పాటు మరో 20 మంది పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇక్కడికి నారాయణపేట జిల్లా ఆస్పత్రి నుంచి ఒక డాక్టర్ వచ్చి వెళ్తుంటాడని అక్కడున్న సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం పీహెచ్‌సీలో, జిల్లా ఆస్పత్రిలో, కోస్గి సీహెచ్‌సీ సెంటర్‌లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను ఇక్కడ విధులను నిర్వహిస్తున్నారు.



సిలిండర్లు లేకుండా ఉన్న ఆక్సిజన్ అందించే రూం

మాయమైన ఆక్సిజన్ సౌకర్యం

ఈ ఆస్పత్రిలో 2021లో కలెక్టర్ హరిచందన చొరవతో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం సహకారంతో రూ.10లక్షల వ్యయంతో 10 బెడ్లకు ఆక్సిజన్ అందించేందుకు వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇక్కడ డాక్టర్లు లేకపోవడంతో ఆక్సిజన్ సిలిండర్లను అధికారులు ఇతర ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం ఇక్కడ ఆక్సిజన్ ఖాళీ సిలిండర్ల రెండు మాత్రమే ఉన్నాయి. అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను గైనాకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంతో దాన్ని ఇతర చోటుకు తరలించారు. కలెక్టర్ నిధులతో ఓ ల్యాబ్‌టెక్నీషియన్‌ను అందుబాటులో ఉంచారు. కొంత కాలంగా ఆయన కూడా విధుల నిర్వహించడం లేదు.

డాక్టర్లు ఉంటే నా భార్య బతికేది

నెలలు నిండిన నా భార్య కాన్పు కోసం మద్దూరు సీహెచ్‌సీకి వచ్చింది. అన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన నర్సులు కాన్పు చేస్తామని తెలిపారు. తీరా కాన్పు సమయంలో రక్తస్రావాన్ని అరికట్ట లేకపోవడంతో నా భార్య చనిపోయింది. డాక్టర్లే ఉంటే నా భార్య చనిపోయి ఉండేది కాదు.

– కృష్ణ, తిమ్మారెడ్డిపల్లి, మద్దూరు

వైద్యులను నియమించాలి

మద్దూరు సీహెచ్‌సీకి చాలా మంది రోగులు వస్తుంటారు. ఇక్కడి వచ్చిన రోగులకు స్టాఫ్ నర్సులచే వైద్యం అందుతుంది. అత్యవసర సమయాల్లో ఇక్కడ వైద్యం అందడం లేదు. ఆస్పత్రికి వైద్యులు లేకపోవడం విడ్డూరంగా ఉంది.

– కిష్ట్యనాయక్, పల్లిగడ్డతండా, మద్దూరు

పోస్టులు మంజూరు కాలేదు

వైద్యవిధాన పరిషత్ నుంచి మద్దూరు ఆస్పత్రికి పోస్టులు మంజూరు కాలేదు. వైద్యం అందించడానికి జిల్లా ఆస్పత్రి నుంచి డాక్టర్‌ను ఓపీ చూడడానికి పంపిస్తున్నాం. స్కానింగ్ మిషను, ఆక్సిజన్ సిలిండర్లను అవసరమున్న చోటకు తరలించాం. ఈ సీహెచ్‌సీ దాదాపు 20 మంది వైద్య సిబ్బంది అవసరం. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– మల్లికార్జున్, సూపరింటెండెంట్, మద్దూరు

పుష్కలంగా నీరున్నా.. ఎండుతున్న పంటలు



మాగనూర్ సమీపంలో నీరు లేక ఎండిన వరి పంట

మాగనూర్: ఓవైపు మండలంలో కృష్ణనది నిండుగా పారుతుంది. మరోవైపు సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉన్నా మాగనూర్ రైతులకు మాత్రం సాగు కష్టాలు తప్పడం లేదు. వర్షాకాలంలో కూడా నీరు లేక పంటలు ఎండుతుంటే రైతులు అల్లాడిపోతున్నారు. ఇది సంగంబండ కుడి లోలెవల్ కెనాల్ దుస్థితి. వర్షాలు పుష్కలంగా కురుస్తున్నాయని అని కాల్వపై ఆధారపడి వరి సాగు చేసుకుంటే సమయానికి నీరు అందక మొదటికే పంటలు ఎండుతున్నాయి. కాల్వలో ఎక్కడిక్కడే పూడిక, పిచ్చి మొక్కలతో నీరు ముందు రాకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతుందని ప్రతిసారి రైతులకు ఇవే బాధలు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చివరి ఆయకట్ట వరకు సాగునీరు అందేలా చూడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

నారాయణపేట: సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు జిల్లా కేంద్రంలో సోమవారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ అందజేశారు. దామరగిద్ద మండలం కందేన్‌పల్లికి చెందిన కిష్టమ్మకు రూ.13వేలు, ధన్వాడకు చెందిన మనెమ్మకు రూ.17వేల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో సత్యయాదవ్, సిద్ధి వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు మహోత్సవం

ధన్వాడ: తల్లితనంను మహిళలకు దేవుడిచ్చిన వరం అని ఆర్‌ఎస్ఎస్ విభాగ్ ధర్మజాగారాన్ ప్రముఖ్ లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆశాడమాస గోరింటాకు మహోత్సవాము నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు బోగం మల్లేశ్వరి మహిళలకు వాయనం ఇచ్చారు. గోరింటాకును పెట్టుకోని ఆనందం వ్యక్తం చేశారు.



పాల్గొన్న మహిళలు

బీటీఏ ఆవిర్భావోత్సవం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బహుజన టీచర్స్ అసోసియేషన్ 24వ ఆవిర్భావది నోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పట్నం చెన్నయ్య మాట్లాడుతూ బీటీఏ సంఘం ప్రారంభం నాటి నుంచి అంబేడ్కర్, ఫులే ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. గౌరవ అధ్యక్షుడు బాలపీర్, కార్యదర్శి కడం బాలశంకర్, విజయ్‌కుమార్, సతయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పెద్దగుట్టపై ముమ్మరంగా పనులు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్ట రంగనాయక స్వామి ఆలయంలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శ్రీరంగనాయక ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వ రాంరెడ్డి ఆధ్వర్యంలో శ్రావణమాస ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం కోనేరు పూడ్చివేసిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం కోనేరులో ఉన్న బండరాళ్లు, మట్టిని జేసీబీ సాయంతో తీసివేసే పనులు కొనసాగుతున్నాయి. సోమవారం కోనేరుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ముమ్మరంగా పనులు చేపట్టారు. అదేవిధంగా గుట్టపై భాగాన వచ్చే వాహనాలు పార్కింగ్‌చేసేందుకు గాను బండరాళ్లను తొలగించి చదును చేస్తున్నారు. గుట్టపైకి వెళ్లేందుకు ఉన్న మెట్ల బాటను బాగు చేయిస్తున్నారు. పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. పూజలు చేసి పనులను ప్రారంభించారు.

ప్రయాణం.. ప్రమాదకరం



సింగంపేట శివారులో మూలమళ్ల రహదారి దుస్థితి



ఆత్మకూర్ విద్యుత్ కార్యాలయం సమీపంలో..

అధ్వానంగా మారిన రహదారి

- 20 ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోని వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్ల, నందిమళ్ల, జూరాల ప్రాజెక్టుకు వెళ్లే రహదారి పట్టణ సమీపంలోని పెట్రోల్‌బంకు మలుపు నుంచి మొదలు ఏడు కిలోమీటర్ల వరకు పూర్తిగా ధ్వసమైంది. 2004లో అప్పటి ఎమ్మెల్యే స్వర్ణసుధాకర్‌రెడ్డి హయాంలో వేసిన రహదారి ప్రస్తుతం పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. 20 ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోకపోవడం లేదని.. బీటీ రోడ్డు వేయించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని ఆయా గ్రామస్తులు, ప్రయాణికులు తెలిపారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని.. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రూ.8.50 కోట్లతో..

2016లో మూలమళ్ల మలుపు నుంచి నందిమళ్ల, జూరాల ప్రాజెక్టు వరకు రూ.8.50 కోట్లతో రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగా మొదటి విడుత నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే నిలిపివేశారు. రహదారి చేపట్టాలంటూ ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు పీజేపీ కార్యాలయం ఎదుట ధర్నా చేసినా నిధుల లేమితో పనులు ముందుకెళ్లలేదు. పంచాయతీరాజ్ నిధుల నుంచి రహదారి నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.



జూరాల కాల్వ సమీపంలో..

వైభవంగా కొడిపీర్ల ఊరేగింపు

నర్వ: మండలంలోని లంకాల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కొడిపీర్ల పండుగను ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. ఎంతో వైభవంగా సాగే ప్రధాన ఘట్టం హజ్రత్ మౌలాలీ పీర్ల సవారీలు ఆదివారం రాత్రి నిర్వహించారు. సోమవారం సాయంత్రం నిర్వహించే సవారీని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చారు. ప్రత్యేక వాయిద్యాలతో అలాయ్ ఆటను యువకులు ఆడుతూ ఆనందించారు. మహిళలు బొడ్డెమ్మలతో అలరించారు. మొక్కు బడులున్న భక్తులు పీర్లకు దట్టీలు, పూలహారాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఏటా నిర్వహించే అతి పెద్ద ఉత్సవాలకు తినుబండారాలు, పిల్లల ఆట వస్తువులు విక్రయించే వారు తమ వ్యాపారాలను కొనసాగించారు.



హజ్రత్ మౌలాలీ పీర్ల ఊరేగింపు



లంకాల్‌లో మహిళల బొడ్డెమ్మలు, యువకుల అలాయ్ ఆటలు

అల్విదా.. అల్విదా..



ఆత్మకూర్‌లో కొడిపీర్ల ఊరేగింపులో భక్తులు

ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధి మసీదులో ప్రతిష్ఠించిన కొడిపీర్ల ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. పది రోజుల పాటు ప్రత్యేక పూజలు, కందూర్లు నిర్వహించి సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని పుర వీధుల గుండా భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగించారు. అలాగే సాయంత్రం హుస్సేనీ ఆలం, మౌలాలీ, ఇమామేఖాసీం, ఇమామే జలాలీ పీర్లను గౌస్ సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అలాయ్ బలాయ్, మహిళల బొడ్డెమ్మలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కొడిపీర్ల ఊరేగింపు చూసేందుకు పట్టణంలోని ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

మట్టి రోడ్డుతో ఇబ్బందులు

మాగనూర్: మండలంలోని నేరడగందొడ్డి రోడు అస్తవ్యస్తంగా మారింది. దశాబ్దాల కాలంగా ఉన్న మట్టి రోడ్లను బీటీలుగా మార్చకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి ప్రజలు వస్తుంటారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కనీసం ఆటోలు కూడా రావడం లేదని, వచ్చినా వారానికి ఒకటి మాత్రమే వస్తాయని వాపోతున్నారు. దీంతో ఏదైనా అత్యవసర సమయం ఏర్పడితే ఇంకా అంతేసంగతి అంటున్నారు. వర్షాలు పడుతుండటంతో ఈ దారి బురదమయంగా మారుతుందని చెబుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాలకు బీటి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



మట్టి రోడ్డుగా ఉన్న నేరడగందొడ్డి రోడ్డు

నిబంధనలు పట్టవా?



మాగనూర్‌లో పరిమితికి మించి వెళ్తున్న ప్రయాణికులు

మాగనూర్: రోడ్డు నిబంధనలు తప్పనిసరి అంటూ అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కొందరు పట్టించుకోవడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ముఖ్యంగా పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేని కారణంగా ఆటోలు, జీపుల్లో ఎక్కువ మందిని తరలిస్తున్నారు. ఒక ఆటోలో నిబంధనల ప్రకారం ఆరుగురు ప్రయాణించాల్సి ఉంటుంది. కానీ 15 నుంచి 20 మందిని తరలిస్తున్నారు.

నిఘా నీడలో క్లబ్‌రోడ్డు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పాతబస్టాండ్ రోడ్డు నుంచి జాతీయరహదారి వరకు ఉన్న క్లబ్ రోడ్డు ఇకపై సీసీ నిఘాలో ఉండనుంది. ఈ రోడ్డుపై మొత్తం 14 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. రియల్ వ్యాపారి హుస్నాబాద్ రాంరెడ్డి అతడి సోదరుడు సూర్యప్రకాష్‌రెడ్డిల సహకారంతో రూ.2లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం సీఐ ఆదిరెడ్డి ప్రారంభించారు. మున్సిపాలిటీలో ఇటీవల దొంగతనాలు పెరిగిన నేపథ్యంలో చర్యలు చేపట్టారు. పోలేపల్లి ఫార్మసెజ్ వల్ల అనేక రాష్ట్రాల నుంచి పట్టణానికి వలసలు పెరుగుతున్నాయి. కాగా వీరిలో కొందరు ఉద్యోగాల పేరిట ఇక్కడ ఉంటూ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా బిహార్, యూపీ ప్రాంతాల వారిపై అనుమానాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు అత్యావశకంగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కెమెరాల ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రాంతం అంతా సురక్షితంగా ఉంటుదని భావించామని .. అందుకే వాటి ఏర్పాటుకు ముందుకువచ్చామని దాత హుస్నాబాద్ రాంరెడ్డి తెలిపారు. కాగా అన్ని కాలనీల్లోనూ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని సీఐ ఆదిరెడ్డి సూచించారు.



సీసీకెమెరా ఏర్పాటుకు పూజలు చేస్తున్న రాంరెడ్డి

నేడు రక్త దాన శిబిరం

నారాయణపేట: యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ప్రకటనలో తెలిపారు. యువతి, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.